రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన మూడో విడత నామినేటెడ్ పదవుల భర్తీలో తిరుపతికి చెందిన కూటమి నాయకులను మూడు కార్పొరేషన్ పదవులు వరించాయి. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) చైర్‌పర్సన్‌గా సుగుణమ్మ, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీహెచ్‌డీసీ) చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా డాలర్ దివాకర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతికి మూడో విడతలో మూడు పదవులు

- ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా సుగుణమ్మ
- ఏపీహెచ్‌డీసీ చైర్మన్‌గా పసుపులేటి హరిప్రసాద్
- తుడా చైర్మన్‌గా డాలర్ దివాకర్ రెడ్డి



సుగుణమ్మ

- మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ 2019 ఎన్నికల్లో రెండోసారి టికెట్ దక్కించుకుని స్వల్ప మెజారిటీతో ఓటమిచెందారు. అప్పటి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వైసీపీ అరాచకాలపై పోరాడుతూ వచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా తిరుపతి సీటు జనసేన పార్టీకి పోవడంతో తొలుత నిరుత్సాహపడినా విజయం కోసం శ్రమించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇంచార్జి హోదాలో ఉంటూ పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సభ్యత్వ నమోదులోనూ తిరుపతిని టాప్‌టెన్‌లో ఉంచారు. ఆమె కష్టాన్ని గుర్తించిని పార్టీ అధిష్ఠానం కీలకమైన ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చింది.

- జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు. పదేళ్లుగా జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా సారథ్య బాధ్యతలు నిర్వర్తించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించి నిరాశపడినప్పటికీ పార్టీ ఆదేశాల మేరకు పనిచేశారు. జనసేన కోటా నుంచి ఏపీహెచ్‌డీసీ పదవిని దక్కించుకున్నారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలోనూ ఈయన చురుగ్గా పనిచేశారు.



హరిప్రసాద్



దివాకర్

- 2024 ఎన్నికల ముందు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విజయం కోసం శ్రమించిన డాలర్ దివాకర్ రెడ్డి తొలి నుంచీ తుడా చైర్మన్ పదవికోసం దృష్టి పెట్టారు. ఆదిశగా పావులు కదిపారు. దీనిపై తీవ్ర పోటీ ఉన్నప్పటికీ అన్ని అవాంతరాలను తొలగించుకుని ఎట్టకేలకు తుడా పీఠం దక్కించుకున్నారు. 'వైసీపీ పాలనలో తుడాను ఒక నియోజకవర్గానికే పరిమితం చేశారు. అలా కాకుండా తుడా పరిధి జిల్లా మొత్తం ఉందని, అవసరమైన చోట తుడా నిధులను వెచ్చించేందుకు ప్రయత్నిస్తాను' అని డాలర్ దివాకర్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

కుప్పం నుంచి మరొకరికి..!

- ఏపీ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్‌గా రాజశేఖర్



కుప్పం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌గా ఎస్.రాజశేఖర్ నియమితులయ్యారు. పాకాల సమీపం అగ్రహారంలోని రైతు శివయ్య కుమారుడైన ఈయన 20 ఏళ్ల కిందట కుప్పం మండలం కంగుందిలో స్థిరపడ్డారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం దగ్గరి బంధువు కూడా. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉంటూ అమరావతిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్నారు. అప్పుడప్పుడూ కుప్పం వచ్చి కుటుంబ వ్యవహారాలు చక్కబెట్టి వెళ్తుంటారు.

పద్మావతి ఆలయ డిప్యూటీఈవోగా హరీంద్రనాథ్

- రిటైర్డ్ అధికారులను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ

తిరుమల, మే11(ఆంధ్రజ్యోతి): తిరుమల రిసెప్షన్ డిప్యూటీఈవో ఆర్2గా ఉన్న హరీంద్రనాథ్‌ను తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీఈవోగా నియమిస్తూ టీటీడీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్2గా ప్రస్తుతం డిప్యూటీఈవో ఆర్1గా ఉన్న భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక, పద్మవతి అమ్మవారి ఆలయ ఇన్‌చార్జి డిప్యూటీఈవోగా ఉన్న గోవిందరాజన్‌కు పూర్తిస్థాయిలో హెచ్‌ఆర్ డిప్యూటీఈవోగా బాధ్యతలు కేటాయించారు. విష్ణునివాసంలో డిప్యూటీఈవోగా ఉన్న విజయ్‌కుమార్‌ను టీటీడీ ప్రెస్ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. ఈస్థానంలో తిరుపతి పద్మావతి అతిథిగృహాల డిప్యూటీ ఈవోగా ఉన్న లక్ష్మణ్‌నాయక్‌ను నియమించారు. కాగా, శ్రీవారి ఆలయ డిప్యూటీఈవోగా పలువురు సీనియర్ అధికారులు విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. తమకు అవకాశమివ్వాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్టు తెలిసింది. త్వరలో మరికొంతమంది డిప్యూటీఈవోల బదిలీలు, ఏఈవోల పదోన్నతులపైనా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

- ఇక, ముగ్గురు విశ్రాంత అధికారులను టీటీడీ నుంచి రిలీవ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. వీరివల్ల ప్రస్తుత అధికారులకు పదోన్నతులు లభించడం లేదంటూ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో గత వైసీపీ ప్రభుత్వంలో దుకాణాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఎస్టేట్ ఆఫీసర్ మల్లికార్జున.. ఇప్పటికీ ఈవో కార్యాలయ ఓఎస్డీగా కొనసాగుతున్నారు.రిటైరైనా కొనసాగింపుపై విమర్శలు రావడంతో రిలీవ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ ప్రెస్ విభాగం ఆఫీసర్ రామరాజు కూడా పదవీ విరమణ చేసినా కొనసాగుతున్న క్రమంలో ఆయన్నూ తప్పించారు. విగ్రహాల తయారీ విభాగం నుంచీ మరో అధికారిని కూడా రిలీవ్ చేసినట్టు సమాచారం.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- 29,871 మందికి 64 కేంద్రాల ఏర్పాటు

తిరుపతి(విద్య), మే 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 24,336 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,535 మంది చొప్పున 29,871 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారని ఆర్‌ఐవో జి.వి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వీరికి 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో తిరుపతి నగరంలోనే 20 ఉన్నాయి. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రాల ప్రాంతాలకు ప్రయాణించొచ్చు. ఇక, అరగంట ముందునుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.

మాతంగుల హంగామా







- గంగజాతరకు పెరిగిన సందడి

తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి): తలకు పసుపుగుడ్డను జడలా కట్టి, కొప్పిముడి వేసుకుని మల్లిపూలు చుట్టుకున్నారు. శరీరమంతా గంధం పూసుకుని చీర, రవిక ధరించారు. మెడలో పూలహారం వేసుకున్నారు. ముఖానికి ఎర్రని బొట్టుపెట్టుకున్నారు. ఇలా.. తిరుపతి గంగజాతరలో ఆదివారం మాతంగి వేషధారణతో భక్తులు హంగామా చేశారు. పలకలు వాయిస్తూ, కొమ్ములు ఊదుతూ ఉంటే మాతంగి వేషగాళ్లు లయబద్ధంగా చిందులు వేసుకుంటూ వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. మరోవైపు తిరుపతి గంగజాతరలో సందడి పెరిగింది. భక్తుల వేషాలు ఊపందుకున్నాయి. మాతంగి వేషంలో మగరాయుళ్లు గంగమ్మకు భక్తితో ప్రణమిల్లారు. వేశాలమ్మ, తాళ్లపాక పెదగంగమ్మ, అంకాళమ్మ తదితర ఆలయాల్లోనూ జాతర సందడి కనిపించింది. తాతయ్యగుంట గంగమ్మకు అధికార, అనధికార ప్రముఖులు ఆలయానికి వచ్చి సారెలు అందజేశారు

నేడు సున్నపు కుండలు: మహిళలపై అత్యాచారం చేస్తున్న పాలేగాడిని గంగమ్మ సంహరించాక తిరుపతికి మేమున్నాం... అంటూ పెదగంగమ్మ, చినగంగమ్మ సున్నపు కుండలు కట్టుకుని అంతటా తిరిగి పూజలందుకుంటారు. పాలేగాళ్ల బాధ ఉండదంటూ భరోసా ఇస్తారు. అప్పటి నుంచి తిరుపతి జాతరలో గంగమ్మ వంశస్థులైన కైకాల కులస్థులు ఈ సున్నపు కుండల వేషాలను ధరించడం ఆచారంగా వస్తోంది. ఇలా సోమవారం సున్నపుకుండల వేషంలో ఉన్న ఇద్దరు కైకాల కులస్తులు పూజలందుకుంటారు. భక్తులు వివిధ వేషాలతో అమ్మవార్లను దర్శించుకుంటారు.









గంగమ్మ ఆలయంలో మంచు మనోజ్ దంపతులు.. భక్తుల పొంగళ్లు

రేపటి జాతరకు 320 మందితో భద్రత

తిరుపతి(నేరవిభాగం), మే 11 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం జరగనుంది. డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో 320 మంది పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 50 మంది ఎస్‌ఐలు, 240 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు, హోంగార్డులు బందోబస్తు విధుల్లో ఉంటారు. ఆలయంలోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ ప్రధాన ద్వారం వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి అనుమతించనున్నారు. క్యూలలో తొక్కిసలాట, తోపులాట జరగకుండా మూడు విభాగాలుగా విభజించారు. అనుమానితులు, పాత నేరస్థులు, చైన్ స్నాచర్లు, జేబు దొంగలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇప్పటికే 26 సీసీ కెమెరాలు, ఫింగర్ ప్రింట్ స్కానర్ ఏర్పాటు చేశారు.



→ ఆలయంలో తప్పిపోయిన బాలికను తల్లిదండ్రుల చెంతకు చేరుస్తున్న పోలీసులు





బంగారు పీఠంపై పద్మావతి అమ్మవారు - స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మవారికి వసంతోత్సవాలు

తిరుచానూరు, మే 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు ఫ్రైడే గార్డెన్‌లో సుందరంగా తీర్చిదిద్దిన పచ్చని వాతావరణంలో శ్రీవారి పట్టపురాణి అలిమేలు మంగ వసంతోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు భక్తిరసంలో ఓలలాడించాయి. రాత్రి అమ్మవారు తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. సోమవారం ఉదయం అమ్మవారికి స్వర్ణ రథోత్సవం జరగనుంది. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టీటీడీ ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్ ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- 15 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీ జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 31వ తేదీ దరఖాస్తుకు చివరి గడువు. సమగ్ర సమాచారం కోసం అడ్మిషన్స్.తిరుమల.ఓఆర్‌జీ.. వెబ్‌సైట్ చూడవచ్చు.

రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్

తిరుపతి(నేరవిభాగం/సెంట్రల్), మే 11 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఉగ్ర ముప్పు నుంచి ప్రయాణికులు తమను తాము ఎలా రక్షించుకోవాలి? ఉగ్రవాదులు చొరబడితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి? విపత్కర పరిస్థితుల నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలపై ఆదివారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే సీఐ ఆశీర్వాదం నేతృత్వంలో పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాయి. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో తిరుపతి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించడానికి తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా ఈ మాక్‌డ్రిల్ సాగింది. రైల్వే హెల్త్ యూనిట్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ టీమ్‌లు చేపట్టాల్సిన అంశాలను సందీప్ కుమార్, ఆశీర్వాదం వివరించారు. కార్యక్రమంలో ఎన్‌వి రమణ, పోతురాజు, సుబ్బరాజు, రాంబాబు, ధర్మేంద్ర రాజు, ఖాశీం, నదియా, మల్లిక తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసులు

పనపాకం టీడీపీ కమిటీ ఎన్నిక


వెంకటేష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, మే 11(ఆంధ్రజ్యోతి): పనపాకం పంచాయతీలోని టీడీపీ గ్రామ కమిటీని ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమై అరిగిలవారిపల్లెకు చెందిన రిటైర్డు ఏఎస్ఐ వెంకటేష్‌ను పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్‌ను, ఉపాధ్యక్షుడిగా జయచంద్రనాయుడును, 24 మంది సభ్యులను ఏన్నుకున్నారు. అనంతరం వెంకటేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నగరం రమేష్, చెంగ్రాయులు, మేడసాని కుమార్, గురవయ్య, జేడీ ప్రసాద్, నరేంద్ర పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



తిరుచానూరు, మే 11(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో ఆదివారం వారాంతపు సెలవుల్లో భాగంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చెన్నైకు చెందిన ఆరుద్ర నాట్య మండలి కళాకారులు యశిక, శివరంజని, సంజన, కవిత, జయశ్రీ, అవంతిక, అనామిక తదితరులు పుష్పాంజలి, శ్రీవిఘ్నరాజం భజే, కీర్తనై, తేనమంగు, మంగళం వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. వీరిని శిల్పారామం ఏఈ రాధాకృష్ణ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

బుకింగ్ కౌంటర్లో సిబ్బందిని నియమించాలని వినతి


చంద్రగిరి స్టేషన్ మాస్టర్‌కి వినతి పత్రాన్ని అందిస్తున్న రైల్వే స్టేషన్ సలహా సంఘ సభ్యులు

చంద్రగిరి, మే 11(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి రైల్వే స్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్‌లో సిబ్బందిని నియమించాలని స్థానిక రైల్వే స్టేషన్ సలహా సంఘ సభ్యులు సంగీతం దొరస్వామి, నరేష్‌కుమార్‌నాయుడు, కన్నయ్యయాదవ్, ధర్మవేణిలు కోరారు. ఆదివారం వారు తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, చంద్రగిరి రైల్వే స్టేషన్ మాస్టర్ సంగీతలకు వినతి పత్రం అందజేశారు. తత్కాల్, అడ్వాన్స్ బుకింగ్ టిక్కెట్ల సమయంలో రైలు వస్తే సిబ్బంది టిక్కెట్లు ఇవ్వలేకపోతున్నారన్నారు. ఉదయం 8, 10, 11 గంటల సమయమే కీలకమన్నారు. పలు రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు స్పందిస్తూ ఆశించిన రెవెన్యూ రానందున సిబ్బందిని నియమించలేమన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



భాకరాపేట, మే 11(ఆంధ్రజ్యోతి): ఎడంవారిపల్లెలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదీ దేవి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. పాండవులు, ద్రౌపదీ, కృష్ణుడు, పోతురాజు విగ్రహాల నుమేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేదమంత్రాల మధ్య మాంగల్యధారణ జరిగింది. మహిళలకు సారె పంపిణీ చేశారు. రాగంశెట్టి వెంకటరత్నం, ప్రసాద్, పురుషోత్తం, దివాకర్, చక్రపాణి ఉభయదారులుగా వ్యవహరించారు. మహిళలు అమ్మవారికి వడిబాలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శివశక్తినగర్‌లో లోవోల్టేజితో కష్టాలు


శివశక్తినగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్

పాకాల, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివశక్తినగర్‌లో ప్రజలు లోవోల్టేజితో అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఐదు వీదుల్లోని సుమారు 300 విద్యుత్ సర్వీసులు వున్నాయి. వీధిలైట్లు, కమర్షియల్ సర్వీసులు కూడా ఉన్నాయి. వీటికి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వుంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లో పరిధిలోని ఇళ్లలో ఫ్యాన్లు సరిగా తిరగడం లేదు. గుడ్డిలైట్లతో జనాలు అవస్థలు పడుతున్నారు. దోమల బెడదతో రాత్రుల్లో జాగారం చేస్తున్నామని జనం వాపోతున్నారు. బోరుసీటి మోటార్లు పనిచేయకపోవడంతో పంచాయతీ కొళాయిలను ఆశ్రయిస్తున్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఆర్థిక ప్రయోజనాల విడుదలలో జాప్యం తగదు

పాకాల, మే 11 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో ఆదివారం జరిగిన బీటీఏ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 అక్టోబర్ నుంచి ఆర్థిక ప్రయోజనాలలో కమ్యూటేషన్ మాత్రమే ఇచ్చి గ్రాట్యుటీ, సరెండర్ లీవ్, జీపీఎఫ్, ఏపిజీఎల్ఐసీ, జిఐసీ విడుదల చేయలేదన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించకపోవడం బాధాకరమన్నారు. బీటీఏ నాయకులు జి.ఆంజినేయులు, బి.రామ్మూర్తి, కె.జ్యోతిప్రసాద్, కృష్ణమూర్తి, ఆదికేశవులు, రాజేంద్రుడు, జయబాల, శివప్రసాద్, గణేష్, రమణ, తులసీరామ్, గోపాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ఆటో సౌకర్యానికి పూర్వ విద్యార్థుల కృషి


సొరకాయలపాళెం ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థులు

రామచంద్రాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): సొరకాయలపాళెం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు(1999-2000 బ్యాచ్ పదవ తరగతి) ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చిన్నబాబు మాట్లాడుతూ పేద విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడానికి ఉచితంగా ఆటో సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామన్నారు. పాఠశాల గదుల మరమ్మతులు, రంగులు వేయడానికి రూ.2.47లక్షలు ఖర్చు చేశామన్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వవిద్యార్థ ఉపాధ్యక్షురాలు నీలారాణి, కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి మునిచంద్రనాయుడు పాల్గొన్నారు.

పుష్పపల్లకీలో ఊరేగిన వీరబ్రహ్మేంద్రస్వామి



రామచంద్రాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లెలో చిత్రపౌర్ణమి సందర్భంగా గోవిందమాంబ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిలను ఆదివారం పుష్పపల్లకీలో వైభవంగా ఊరేగించారు. వారం రోజులుగా ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త బ్రహ్మానందరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పెరుమాళ్లపల్లెలో టీడీపీగ్రామ కమిటీ ఎన్నిక

తిరుపతిరూరల్, మే11(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపల్లె గ్రామ టీడీపీ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండలపార్టీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వై.గురుసాకేత్, రెడ్డిమునెప్ప, ఉపాధ్యక్షులుగా కె.మునిశంకర్‌రెడ్డి, బీసీసెల్ ప్రతినిధిగా గంగప్ప, ఐటీడీపీ ప్రతినిధిగా బి.నవకిశోర్‌రెడ్డి, ఎస్సీసెల్ ప్రతినిధిగా ఒ.మునీంద్ర, తెలుగుమహిళా ప్రతినిధులుగా ఎస్.పుష్ప, ఆర్.దుర్గని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

తెలుగు పదానికి జన్మదినం

జానపదానికి జ్ఞానపథం

- శ్రీవారిని సంకీర్తనలతో అభిషేకించిన పదకవితా యోగి
- నేటి నుంచి అన్నమయ్య జయంతి ఉత్సవాలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11 (ఆంధ్రజ్యోతి): చందమామ రావే.. జాబిల్లి రావే.. అనే పాట వినని తెలుగు వారు ఉండరు. జో అచ్యుతానంద జోజో ముకుందా.. అనే పాట చెవిన పడని శ్రీవారి భక్తులు ఉండరు.. ఇలాంటి 32 వేల సంకీర్తనలతో వెంకటేశ్వరుడిని అర్చించిన పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. తొలి తెలుగు వాగ్గేయకారుడిగా ప్రసిద్ధి పొందిన ఈ సంకీర్తనాచార్యుడి 617వ జయంతోత్సవాలను సోమవారం నుంచి ఈనెల 18 వరకూ నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఈసందర్భంగా తాళ్ళపాక, రాజంపేట, తిరుపతిల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. సోమవారం ఉదయం 9 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సంగీత గోష్ఠి నిర్వహించనుంది.

అచ్చ తెలుగు నుడికారం

1408లో ఉమ్మడి కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకలో అన్నమయ్య జన్మించారు. తల్లిదండ్రులు లక్కమాంబ, నారాయణసూరిల నుంచే సంగీత, సాహిత్య ప్రతిభను వారసత్వంగా పొందారు. గణవిష్ణుడు గురువుగా పంచ సంస్కార దీక్షను స్వీకరించారు. ఎనిమిదేళ్ళ ప్రాయంలోనే కాలి నడకన తిరుమల చేరుకుని తన కీర్తనా కుసుమాలతో కలియుగ దైవాన్ని అభిషేకించారు. పద్యానికీ గేయానికి మధ్య జానపదాన అచ్చ తెలుగు నుడికారంతో అన్నమయ్య సంకీర్తనలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. అందువల్లే ఇప్పటికీ జనబాహుళ్యంలో మారుమోగుతున్నాయి. ఆయన గొంతులో కీర్తన జాలువారితే శ్రీవారి ఆలయ తలుపులు తెరుచుకున్నట్టు ఐతిహ్యం. అన్నమయ్య విరచితాలతోనే నేటికీ శ్రీవారి మేలుకొలుపు, పవళింపు కార్యక్రమాలు నిర్వహించడం ఆ మహాభక్తుని వైశిష్ట్యానికి నిదర్శనం. జీవితాన్ని శ్రీవారికి అంకితం చేసిన ధన్యజీవిగా అన్నమయ్యను శ్రీవారి అవతారంగా పురందరదాసు పేర్కొన్నారు.

సజీవంగా.. సంకీర్తనలు..

ముద్దుగారే యశోదకు ముంగిట ముత్యము వీడు.., కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, అదివో.. అల్లదివో.. శ్రీహరివాసము, అలర చంచలమైన ఆత్మలందుండేవు వంటి వేల సంకీర్తనల ద్వారా తెలుగువారి సంపదగా అన్నమాచార్య నిలిచిపోయారు. వేటూరి ప్రభాకరశాస్త్రి ద్వారా వెలుగు చూసిన అన్నమాచార్య సంకీర్తనలకు టీటీడీ అప్పటి ఈవో పీవీఆర్‌కె ప్రసాద్ విశేషంగా స్పందించారు. ఆ ఫలితమే 1978లో అన్నమాచార్య పేరి ప్రాజెక్టు ఆవిర్భాం. ఈప్రాజెక్ట్ ద్వారా అన్నమయ్య కీర్తనలకు ఎంతో ప్రాచుర్యం కల్పించారు. సాధు సుబ్రమణ్యశాస్త్రి, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, రాళ్ళపల్లె అనంతకృష్ణశర్మ, నేదునూరి కృష్ణమూర్తి, గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్, శోభారాజు వంటి గాయకులు ఈ కీర్తలను తమ గాత్రంతో విశ్వవ్యాప్తం చేశారు. ప్రాజెక్టు అధికారిగా డాక్టర్ మేడసాని మోహన్ అన్నమాచార్య సాహిత్యానికీ, ఔన్నత్యానికీ విస్తృత ప్రచారం కల్పించారు. తిరుపతిలో పదకవితా పితామహుడి విగ్రహాన్ని నెలకొల్పారు.

ప్రతిష్ఠాత్మకంగా వేడుకలు నిర్వహిస్తాం



అనమాచార్య జయంతి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. సాహిత్య, సంగీతవేత్తల ద్వారా అన్నమయ్య సంకీర్తనల్లోని లోతైన సారాన్ని కొత్త తరానికి తెలియజేయాలనుకుంటున్నాం. యువతరానికి అన్నమయ్య సాహిత్యాన్ని అందించాలని టీటీడీ చైర్మెన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు సంకల్పిస్తున్నారు. ఇందుకు అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా ప్రణాళికను, కాల వ్యవధిని నిర్దేశించుకొని లక్ష్యాన్ని సాధించే ప్రయత్నం చేస్తాం.

- డాక్టర్ మేడసాని మోహన్, ప్రత్యేకాధికారి, అన్నమాచార్య ప్రాజెక్టు

శ్రీవారిసేవలో ప్రముఖులు



ప్రతిభాభారతి, ఎమ్మెల్సీ గ్రీష్మ -గాయని మాన్య

తిరుమల, మే11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ స్పీకర్ కావలి ప్రతిభ భారతి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, గాయని మాన్య చంద్రన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, మే11(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 14 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.2.67 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 85,078 మంది భక్తులు దర్శించుకున్నారు. 35,791 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతంచేద్దాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతాప్ స్వామి

రామచంద్రాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేద్దామని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి పిలుపునిచ్చారు. రాయలచెరువు కట్ట రాయలమండపం వద్ద ఆదివారం హనుమాన్ శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌స్వామి మాట్లాడుతూ రాయలచెరువుకట్ట ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈనెల 22వ తేదీ ఉదయం 8గంటలకు ఆంజనేయస్వామి ఉత్సవమూర్తితో ఊరేగింపు బయలుదేరుతుందన్నారు. అబ్బూరు దేవరాజులునాయుడు, దేశిరెడ్డితదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి అచ్చెన్నాయుడు



తిరుచానూరు, మే 11(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితలు ఆయనను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల మంత్రి దుశ్శాలువాతో డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి సత్కరించారు.

పద్మశాలి ప్రతిభా పురస్కారాలు


విద్యార్థులకు సత్కారం

తిరుచానూరు, మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో పద్మాశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులను సత్కరించారు. పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన పద్మశాలి విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పీఈడబ్ల్యూఏ కార్యదర్శి రాపర్తి వెంకట్రావు, తిరుపతి పద్మశాలి సంఘ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, శ్రీరామ పరంధామయ్య, జయ పెరుమాల్; వాణి పాల్గొన్నారు.

తిరుమల భద్రతలో భాగస్వాములు కావాలి


తిరుమల స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

తిరుమల, మే11(ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తిరుమల క్షేత్ర పటిష్ట భద్రత కల్పనలో స్థానికులు భాగస్వాములు కావాలని పోలీసులు కోరారు. తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో టూటౌన్ సీఐ శ్రీరాముడు, క్రైం సీఐ శేషగిరి, ఎస్ఐ రమేష్, విజిలెన్స్ వీఐ నరిసింహులు స్థానికులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. తిరుమల క్షేత్రానికి, ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. స్థానికులు కూడా భద్రతను పెంచే విషయంలో సహకరించాలన్నారు. ప్రస్తుతం తిరుమలోని నివసిస్తున్న యజమానులు, అద్దెకు ఉంటున్నవారు తమ వివరాలను పోలీసులకు అందజేయాలని కోరారు.

అనుబంధాల వేదికగా పూర్వ విద్యార్థుల సమావేశం



తిరుచానూరు, మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001-02లో పదవ తరగతి చదివిన విద్యార్థుల సమావేశం జరిగింది. 23 ఏళ్ల తరువాత వీరంగా కలుసుకున్నారు. చదువుకున్న రోజుల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనుబంధాలను పునరుద్ధరణకు, సమాజహిత కార్యక్రమాలపై చర్చించేందుకు వీరి సమావేశం వేదికగా నిలిచింది. వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు ఎన్నో సంగతులను కలబోసుకున్నారు. వీరంతా కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయులు మురళి, ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, మునికృష్ణమాచారి,తులసీరామ్, హంసవేణి, భారతి, సూర్యకళ, రఘురాం, పాల్గొన్నారు.

కష్టాలు తెలిసిన వారే పేదల సమస్యలు తీర్చుతారు


సురేష్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నరసింహయాదవ్, అన్నా అనిత తదితరులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 11(ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలు తెలిసిన వారే వారి సమస్యలు తీర్చగలుగుతారని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి సివిల్స్‌లో 988 ర్యాంకు సాధించిన పామూరు సురేష్‌యాదవ్‌ను ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నరసింహయాదవ్ మాట్లాడుతూ సురేష్‌యాదవ్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, జయరాంయాదవ్, వాసుయాదవ్, హేమంత్ యాదవ్, మునస్వామి యాదవ్, కృష్ణయాదవ్, వెంకటముని యాదవ్, భరణి యాదవ్, శ్రీనివాసులుయాదవ్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

బస్ కల్వర్ట్‌ను ఢీకొని 30మందికి గాయాలు


కల్వర్ట్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్

చంద్రగిరి, మే 11(ఆంధ్రజ్యోతి): అగరాల వద్ద ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్ కల్వర్టును ఢీకొన్న సంఘటనలో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వివరాలిలి. తిరువాణ్ణమలై నుంచి తిరుపతి వస్తున్న ఆర్టీసీ బస్ రాత్రి 11-30 గంటల సమయంలో అగరాల సమీపాన కల్వర్టు దిమ్మెను ఢీకొంది. బస్సులో ఉన్న 30 మంది గాయపడ్డారు.వీరిలో డ్రయివర్, కండక్టర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

టీడీపీ పంచాయతీ కమిటీలు ఏకగ్రీవం



గోవిందరాజులు - సురేష్‌నాయుడు

తిరుపతి అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సి.హెచ్.సురేష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా రవిచంద్ర, ఉపాధ్యక్షుడిగా బాలాజీప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా జానకి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మి, తెలుగు యువత అధ్యక్షుడిగా శశిధర్‌బాబు, ఐ.టీడీపీ అధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా సాయికృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కె.కుల్లాయప్ప, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా అన్వర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఆసియా ఎన్నికయ్యారు. తిరుమలనగర్ గ్రామ పంచాయతీ కమిటీ అధ్యక్షుడిగా ఎస్.ఈ.గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా టి.చంద్ర, మహిళా అధ్యక్షురాలిగా జి.శ్రీదేవి, మహిళా కార్యదర్శిగా జి.అమరావతి ఎన్నికయ్యారు.

తుమ్మలగుంట గ్రౌండ్ పరిరక్షణకు పోరు

●చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



తిరుపతి రూరల్, మే11(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశామని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌లో ఆదివారం గ్రామస్తులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ చెరువును పార్క్‌గా తీర్చిదిద్దామన్నారు. విశాఖ తర్వాత తుమ్మలగుంటలోనే అతిపెద్ద గ్రౌండ్ ఉందన్నారు. దీన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎవరైనా ముందుకు వస్తే గ్రామస్తులంతా కలసికట్టుగా పోరాడి నిలబెట్టుకుందామన్నారు. తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

20న టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల, మే 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 20వ తేదీన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులందరూ తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమావేశంకానున్నారు. కొనుగోలు, ఇంజినీరింగ్ పనులతో పాటు పలు కీలక అంశాలపై రూపొందించిన అజెండాపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

ఘనంగా విద్యార్థి వ్రతహోమం



తిరుపతి అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి) : రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆదివారం సంస్కార శిబిరంలో విద్యార్థులతో క్రమశిక్షణ, సత్ప్రవర్తన, విద్యాభివృద్ధి కలిగించేలా ప్రత్యేక హోమం నిర్వహించారు. ఉదయం మంగళహారతి, శ్రీరామకృష్ణ సుప్రభాతంతో వ్రత కార్యక్రమం ప్రారంభమైంది. సంకల్ప మంత్రం జపిస్తూ బిల్వ పత్రాలతో హోమం చేపట్టి అగ్నికి ఆహుతి ఇచ్చారు. విద్య, శరీరపోష్టి, నడవడిక, సత్యం పలకాలని, క్రమశిక్షణతో మెలిగే విధంగా విద్యార్థులతో ప్రతిజ్ఞలు, ప్రమాణాలు చేయించారు. ఆశ్రమ కార్యదర్శి సుకృతానంద మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. యోగా, భక్తి, కర్రసాము, ఆర్చరీ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో హరికృపానంద, విశ్వరాజానంద, గీతా, హిమబిందు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తి, మే 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వారాంతపు, వేసవి సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 423 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,237, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,448 మంది భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా వెంగమాంబ జయంతి



తిరుమల, మే11(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంబగమాంబ జయంతి ఉత్సవం తిరుమల నారాయణగిరి ఉద్యావనంలోని పద్మావతి పరిణయోత్సవ మండపంలో ఆదివారం వైభవంగా జరిగింది. ముందుగా శ్రీవారు ఉభయదేవేరులతో కలిసి ఆలయ మాడవీధుల ద్వారా ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనానికి చేరుకున్నారు. స్వామికి ఉయ్యాలసేవ నిర్వహిస్తున్న సమయంలో అన్నమాచార్యప్రాజెక్ట్, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల కళాకారులు గోష్ఠిగానం చేశారు. వెంగమాంబ విరచిత సంకీర్తనలను ఆలపించారు. బెంగళూరు రాఘవేంద్ర స్వామి మఠాధిపతి సువిద్యేంద్ర తీర్థ స్వామిజీ అనుగ్రహభాషణం చేశారు.దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు. బృందావనంలో అధికారులు, వెంగమాంబ వంశీకులు పుష్పాంజలి ఘటించారు. నృసింహజయంతి సందర్భంగా ఉప ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేకాభిషేకం చేశారు.

మాతంగి వేషంలో సందడి





కుటుంబ సభ్యులతో కలిసి సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య దంపతులు, ఎంపీ గురుమూర్తి దంపతులు

● మొక్కులు తీర్చుకున్న భక్తులు
● పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పణ

తిరుపతి(జీవకోన), మే 11(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం మాతంగి వేషంలో భక్తులు సందడి చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం భక్తజన సంద్రంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. క్యూలన్నీ కిటకిటలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టారు. మొక్కులు ఉన్న వారు జంతు బలులు సమర్పించారు. అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా పెట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో కమిషనర్ మౌర్య ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

సారె సమర్పించిన ప్రముఖులు

తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, శాప్ చైర్మన్ రవినాయుడు కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకు సారె సమర్పించారు. మున్సిపల్ మాజీ కమిషనర్ హరిత, మాజీ ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఊకా విజయకుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

దొంగలపై నిఘా

ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగలను గుర్తించేందుకు ఆలయం వద్ద ఫింగర్ ప్రింట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దాని ద్వారా పాత నేరస్తులను గుర్తించి విచారించి పంపారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత

ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువ ఉండటంతో కొందరు చిన్నారులు తప్పిపోయారు. వారిని అధికారులు గుర్తించి అనౌన్స్‌మెంట్ ద్వారా వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు సూచిస్తూ మైక్‌ల ద్వారా సూచనలు చేశారు.

మజ్జిగ పంపిణీ

గంగమ్మ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ రవినాయుడు హాజరై మజ్జిగ పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, ఆర్వో సేతుమాధవ్, జలపోతు చంద్ర, ఆముదాల వెంకటేష్, హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.





సారె తీసుకొస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు దంపతులు, కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, మజ్జిగ పంపిణీ చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, మునికృష్ణ, ఊకా విజయకుమార్, మహేష్‌యాదవ్ తదితరులు

అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నా..

గంగమ్మను భక్తిశ్రద్ధలతో కోరుకుంటే కచ్చితంగా నెరవేర్చుతుంది. గత ఏడాది నేను కోరుకున్న కోరిక నెరవేరడంతో ఈ ఏడాది జాతర సందర్భంగా కృష్ణుడి వేషం ధరించి, మొక్కు చెల్లించుకున్నాను.

- విష్ణు, తిరుపతి



కోర్కెలు తీర్చే తల్లి..

గంగమ్మ కోర్కెలు తీర్చే కొంగు బంగారం. జాతరలో వేషం ధరించి అమ్మవారికి మొక్కుకుంటే ఎలాంటి కోర్కైనా తప్పకుండా నెరవేరుతుంది. అందుకే అమ్మవారికి మొక్కు చెల్లించుకుంటున్నా.

- సత్యనారాయణ, తిరుపతి



35 ఏళ్లుగా వేషం వేస్తున్నాను..

నా చిన్నతనంలో అమ్మవారు రావడంతో వేషం వేసి, దర్శించుకుంటామని తల్లిదండ్రులు గంగమ్మకు మొక్కుకున్నారు. దీంతో 35సంవత్సరాల నుంచి ఏటా జాతరకు ఏదో ఒక వేషం ధరించి, అమ్మవారిని దర్శించుకుంటున్నాను.

- వంశీ, శెట్టిపల్లి







మాతంగి వేషధారణలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు, భక్తులతో కిక్కిరిసిన ఆలయ ఆవరణం







గాయపడిన మహిళ మృతి

తిరుపతి(నేరవిభాగం), మే 11(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో గాయపడి రుయాలో చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం మృతి చెందింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. తిరుపతి రూరల్ పైడిపల్లికి చెందిన పంబల కన్నయ్య భార్య ఆనందమ్మకు మతిస్థిమితం లేదు. ఈనెల 9వ తేదీన ఇంట్లో దీపం వెలిగిస్తుండగా చీరకు నిప్పు అంటుకుంది. గమనించుకోకపోవడంతో మంటలు పెద్దవై తీవ్ర గాయాలపాలైంది. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు విజయకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షేక్ షావలి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పట్టువస్త్రాల సమర్పణ



తిరుపతి(గాంధీరోడ్డు), మే 11 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా ఆది వారం సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయాధికారులు వారికి దర్శన ఏర్పాట్లు చేశారు.

పట్టుదలతో శ్రమిస్తే విజయాలు తథ్యం..!

● సివిల్స్ విజేత పామూరి సురేష్



విద్యార్థులతో సురేష్, దామోదర్‌రావు తదితరులు

తిరుపతి(గాంధీరోడ్డు), మే11(ఆంధ్రజ్యోతి): ఎంచుకున్న రంగంలో పట్టుదల, ఇష్టంతో శ్రమిస్తే విజయాలు వాటంతటవే వరిస్తాయని సివిల్స్ విజేత పామూరి సురేష్ తెలిపారు. తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో గీతగోవిందం సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లాలో టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించిన యాదవ, కురబ విద్యార్థులకు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు. గీతగోవిందం సేవాసమితి అధ్యక్షుడు దామోదర్‌రావు, కార్యదర్శి వరదరాజులు, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఐశ్వర్య'లో మదర్స్ డే వేడుకలు



ఐవీఎఫ్ తల్లులను సత్కరిస్తున్న వైద్యులు గీత, తనూజ

తిరుపతి, మే 11 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటర్‌లో ఆదివారం మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐవీఎఫ్ చికిత్స ద్వారా గర్భం దాల్చిన తల్లులను సత్కరించారు. ఐవీఎఫ్ నిపుణులు, గైనకాలజిస్టులు డాక్టర్ గీతావాణి, డాక్టర్ తనూజలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక బ్రాంచ్‌లు కలిగిన తమ ఆస్పత్రిని తిరుపతిలో ప్రారంభించిన అనతికాలంలోనే ఐవీఎఫ్ చికిత్స విజయవంతంగా చేయడం ఆనందంగా ఉందన్నారు. పిల్లలు లేని దంపతులకు అత్యుత్తమ చికిత్స అందించడానికి అన్ని వసతులు ఉన్నాయన్నారు.

వస్తువుల కొనుగోలుపై అవగాహన ఉండాలి



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మే 11 (ఆంధ్రజ్యోతి): వస్తువులు కొనుగోలు చేసే సమయంలో అవగాహన కలిగి ఉండాలని లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా తూనికలు, కొలతల్లో జరుగుతున్న మోసాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. రైతు బజారు, డీమార్టు వద్ద ఎగ్జిబిషన్ నిర్వహించారు. పెట్రోలు, బంగారం కొనుగోలు పట్ల అవగాహన కల్పించారు.

లూపస్ వ్యాధితో జాగ్రత్తగా ఉండాలి



వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి(ఆటోనగర్), మే 11 (ఆంధ్రజ్యోతి): నివారణలేని లూపస్ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు దామోదరం, రెడ్డెప్ప అన్నారు. కరకంబాడీ మార్గంలోని వినాయకసాగర్ ప్రాంగణంలో ఆదివారం వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో లూపస్ వ్యాధి నివారణపై శుభోదయం ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం వైద్యులను వాకర్స్ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, సుబ్రమణ్యం రాజు, రామస్వామి, చంద్ర, శేషాద్రి, సాయిబాబారెడ్డి, శాంతి, వెంకట్ రాయల్, నాగమణి పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం



తిరుపతి(జీవకోన), మే 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్‌ను ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ కాణిపాకంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, సత్యవేడు నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సతీష్ ఆమె వెంట ఉన్నారు.

టీటీడీ వసతి గృహాల్లో భద్రత కరువు

ఆరు నెలల్లో 120 చోరీలు

తిరుపతి(నేరవిభాగం), మే 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ వసతి సముదాయాల్లో భద్రత కొరవడింది. ఆరు నెలల వ్యవధిలో 120 చోరీలు జరిగాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 10 రోజుల క్రితం కాకినాడకు చెందిన రెండు కుటుంబాలు తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చారు. తిరుపతిలో టోకెన్లు కట్టించుకుని శ్రీనివాసం వసతి సముదాయంలో రెండు గదులు అద్దెకు తీసుకున్నారు. రాత్రి ఇక్కడే బసచేసి మరుసటి రోజు తిరుమలకు బయలుదేరుతుండగా బ్యాగులో ఉంచిన రెండు మొబైల్ ఫోన్లు, రూ.5,300 నగదు కనిపించలేదు. బ్యాగు మాత్రం గది బయట కనిపించింది. విజిలెన్సు సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈనెల రెండో తేదీ విష్ణు నివాసంలో తెలంగాణాకు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గది అద్దెకు తీసుకున్నారు. నిద్రపోతున్న తరుణంలో పర్సు, ఏటీఎం కార్డులు కొట్టేశారు. ఇలాంటి ఘటనలు రోజూ జరుగుతున్నా కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. మరికొందరు వెళ్లిపోతున్నారు. పోలీసులు, విజిలెన్సు అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. నిఘాను పటిష్ఠం చేయాలని కోరుతున్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, మే 11(ఆంధ్రజ్యోతి) : తిరుపతి-కడప అటవీ శాఖ అధికారులు ఆదివారం కారు సహా 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రహస్య సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు మామండూరు నార్త్‌బీట్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు కారు అతివేగంగా వచ్చింది. ఆపే ప్రయత్నం చేసినా వెళ్లిపోవడంతో వెంబడించారు. మామండూరు గ్రామ సమీపంలోని ఊటీ కాలువ వద్ద వాహనాన్ని వదలిపారిపోయారు. కారును పరిశీలించగా 10 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనం సహా స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో మామండూరు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌస్‌కరీం, ఎఫ్‌బీవోలు శరవణకుమార్, జాన్ శ్యాముల్, అరవింద్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనం సహా పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అటవీ శాఖ అధికారులు

విద్యుత్ ఉత్పత్తిపై వర్క్‌షాప్

మంగళం, మే 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా 4 నుంచి 6వ తరగతి విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తిపై వర్క్‌షాప్ నిర్వహించారు. 50మంది విద్యార్థులు పాల్గొనగా డైనమో, జనరేటర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ఎలా అవుతుంది అనే అంశంపై వివరించారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు విద్యార్థుల భవిష్యత్తు కు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో సైన్స్‌సెంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పురుషోత్తం పాల్గొన్నారు.



విద్యుత్ ఉత్పత్తి గురించి వివరిస్తున్న ఎడ్యుకేషన్ ఆఫీసర్ పురుషోత్తం

ఐక్యతతో హక్కుల సాధన

మాలల ఆత్మీయ గౌరవ సభలో ఎమ్మెల్యే వివేక్



ఐక్యత చాటుతున్న మాల సంఘాల నేతలు

తిరుపతి అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా మాలలందరూ ఐక్యతతో ముందడుగు వేస్తూ హక్కుల సాధనకు కృషి చేయాలని తెలంగాణ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఆదివారం సాయంత్రం మంగళంలోని ఆశ కన్వెన్షన్ సెంటర్‌లో మాలల ఆత్మీయ గౌరవసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారం చేపట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలల పట్ల వివక్ష చూపుతూ దగా చేస్తున్నాయన్నారు. మాలమాదిగల మధ్య చిచ్చుపెడుతూ తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ చట్ట విరుద్ధమని గతంలో కోర్టులు సూచించినా మళ్లీ పునరావృతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. న్యాయస్థానం సైతం వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. రాజ్యాంగ బద్ధంగా దళితులకు లభించిన రిజర్వేషన్లను భవిష్యత్తులో పూర్తిగా ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపీలు రెడ్డెప్ప, చింతామోహన్ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాలరాసే ప్రభుత్వాలకు మాలలు సంఘటితమై గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వ రంగంలోనే కాక ప్రైవేటు, కాంట్రాక్టు రంగాల్లోనూ రిజర్వేన్లు సాధించుకోవాల్సిన అవసరముందన్నారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండు వద్దవున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా మంగళం చేరుకున్నారు. ఎంపీ గురుమూర్తి హాజరై సంఘీభావం తెలిపారు. మాల ఉద్యోగుల సంఘం నేత అశోక్‌బాబు, రాఘవ, రాయలసీమ మాలల జేఏసీ గౌరవాధ్యక్షుడు అశోకరత్నం, మల్లారపు మధు, దుగ్గాని జయరాం, దాము, కృష్ణ పాల్గొన్నారు.

పెద్ద శేష వాహనంపై కల్యాణ వెంకన్న విహారం

నారాయణవనం, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి స్వామివారు పెద్ద శేష వాహనంపై విహరిస్తూ భక్తులపై వరాల జల్లు కురిపించారు. ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. వేకువ జామున 3 గంటలకు ఆలయాన్ని తెరచి, స్వా మివారికి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ మాడవీధుల్లో ఉత్సవ మూర్తుల ఊరేగింపు అనంతరం ఆలయంలో ధ్వజ స్తంభానికి అభిషేకాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు మధ్య గరుడాళ్వార్ చిత్రపటాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపజేయడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక వీరరాఘవ దేవస్థానం నుంచి పద్మశాలీలు ఊరే గింపుగా ఆలయానికి చేరుకుని స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. 11 గంటలకు ఉత్సవమూర్తులకు ఆగమోక్తంగా స్నపన తిరు మంజనం, దీప, ధూప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామివారు ఉభయ నాంచారులతో పరమపదనాథుడిగా ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఉభయ నాంచారులతో విశేష అలంకరణలో కల్యాణ వెంకన్న పెద్దశేష వాహనంపై అధిరోహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

యద్భావం తద్భవతి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాణిసదాశివమూర్తి, మేడసాని మోహన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 11 (ఆంధ్రజ్యోతి): రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు రాసిన యద్భావం తద్భవతి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. వేద వర్సిటీ వీసీ రాణిసదాశివమూర్తి, అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మేడసాని మోహన్, రామకృష్ణ మిషన్ స్థానిక కార్యదర్శి సుకృతానంద తదితరులు ఆవిష్కరించారు. ఈ పుస్తకంలోని కథలు చదవడం ద్వారా మంచి వ్యక్తిత్వం అలవడుతుందని వారు అభిప్రాయపడ్డారు. రచయిత కృష్ణస్వామిరాజు తన జీవితానుభవంలో నుంచి ఈ కథలు రాసినట్టు అనిపిస్తోందన్నారు. స్కాలర్ రమేష్‌బాబు, కవి మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ కథలు మనుషుల్లో విలువలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం శ్రీదేవి, సర్వోత్తమరావు, షణ్ముగం, సాహిత్యవేత్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బాలాయపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిమిలి పంచాయతీ, కసుమరాయ కొండపై వెలసిన లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారి అభిషేకం చేశారు. మధ్యాహ్నం మహానివేదన జరిగింది. అన్నదానం, రాత్రి వేదమంత్రాల నడుమ ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వహకులు బత్తల సుబ్బారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు రాయి సత్యం నాయుడు, పార్లపల్లి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి



క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గూడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏసీఏ సబ్‌సెంటర్‌లో క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ, వ్యాయామం తప్పనిసరి అన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. డాక్టర్ జనార్దనరెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణంలో ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, మునిగిరీష్, మస్తానయ్య, నవీన్‌కుమార్, కోచ్ లవకుమార్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, రజనీకాంత్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ



క్రీడాకారులకు టీషర్టులను అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

గూడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహిస్తున్న హాకీ శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో టీ షర్టులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ హాకీ కోచ్ దీపక్ ఆకాష్ అభ్యర్థన మేరకు క్రీడాకారులకు టీ షర్టులను అందజేయడం జరిగిందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రమేష్, లక్ష్మీనారాయణరెడ్డి, మురళీ నాయుడు, ప్రభాకర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నారాయణ, కోచ్ దీపక్‌ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయవాడలోని మాతమ్మ ఆలయంలో మాతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతమ్మ కొలుపులో భాగంగా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం వద్ద అమ్మవారి ముగ్గు, కంకణధారణ, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రికి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. తప్పెటు, తాళాలు, యువత చిందుల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని మాతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

గూడూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పాత కౌలు చట్టాన్ని రద్దుచేసి గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కౌలురైతుకూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు ఆర్థికసాయం అందజేయాలన్నారు. అలాగే పంటలకు మద్దతు ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, లక్ష్మీపతి, దయాకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణరావు, బీవీ రమణయ్య, శంకరయ్య, ప్రసాద్, ముత్యాలయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పూజలు

గూడూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుకుంటూ జనసేన నాయకులు ఆదివారం పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. శత్రు సైన్యాలపై పోరాడుతున్న మన సైన్యానికి, దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాని మోదీకి భగవంతుని ఆశీస్సులు ఉండాలని పూజలు జరిపామన్నారు. కార్యక్రమంలో మోహన్, సాయికిరణ్, మనోజ్, మధుసూదన్‌రావు, జయదేవ్, మస్తాన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



పెంచలకోన ఆలయంలో జనసేన నాయకులు

బాలసదనంలో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

గూడూరు అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని బాలసదనం చిల్డ్రన్‌హోమ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపాదికను భర్తీ చేయనున్నట్లు బాలసదనం సూపరింటెండెంట్ అరుణ ఆదివారం తెలిపారు. బాలసదనంలో కుక్, నైట్ వాచ్ ఉమెన్, ఎడుకేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9441990835 నంబరును సంప్రదించాలని సూచించారు.

'అన్నదాత సుఖీభవ' అర్హుల పేర్లు సరిచూసుకోండి

పెళ్లకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల వివరాలు గ్రామ సచివాలయాల్లో వీఏఏల వద్ద ఉన్నాయని, లబ్ధిదారులు పరిశీలించుకోవాలని మండల వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదిలో మూడు విడుతలుగా రూ.20వేలు ఆర్థిక సాయం రైతులకు అందిస్తామని ఆమె చెప్పారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుపాడు గ్రామంలో నివాసం ఉంటున్న రమేష్(40) కుటుంబ కలహాల కారణంగా ఈ నెల 9వ తేదీ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రమేష్ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

నేటి నుంచి వేనాడులో మహాలక్షార్చన

సూళ్లూరుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): చైత్రపౌర్ణమి పురస్కరించుకొని వేనాడు దీవిలో వెలసిన శృంగీశ్వర శ్రీరంగపెరుమాల్ ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు మహాలక్షార్చన నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం స్వామివారికి మహా తిరుమంజనం, వస్త్రాలంకరణ, మహాలక్షార్చన, రాత్రి తిరుకల్యాణం, మంగళవారం పూలంగిసేవ, బుధవారం స్వామివారికి గంథాలంకారం నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు దీవి కుప్పుస్వామి తెలిపారు.







సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు - స్వామివారికి నిర్వహించిన సహస్ర దీపాలంకరణ సేవ - గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు

ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం

పెంచలో... గోవిందా..! నామస్మరణతో మార్మోగిన కోన గిరులు ● రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనలో ఆదివారం నృసింహ జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. కొండాకోనా.. ఎటుచూసినా భక్తజనం... ఎవరినోట విన్నా పెంచలో.. గోవిందా..! అనే నామస్మరణే. భక్తకోటి పిలుపుతో పెనుశిల నృసింహుడు పరవశించిపోయాడు. ఆదివారం రాత్రి స్వర్ణమయకాంతులతో వెలిగిపోతున్న గరుత్మంతుడిపై కొలువుదీరిన శ్రీవారు అశేష జనవాహినిని కటాక్షించారు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో కోన కిక్కిరిసింది. పలువురు తలనీలాలు సమర్పించుకుని పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు.

సింహవాహనంపై శ్రీవారి చిద్విలాసం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని పరిమళ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సింహవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో శ్రీవార్లకు హోమాలు, స్నపనతిరుంజనం, తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవ జరిగాయి.

బంగారు గరుడుడిపై ఊరేగింపు

పెనుశిల లక్ష్మీనరసింహుడు తన ఇష్ట వాహనమైన బంగారు గరుడుడిపై ఆసీనులై మాడవీధుల్లో విహరించారు. స్వర్ణకాంతులతో మెరిసిపోతున్న పెంచలస్వామి దివ్య స్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు వీర్ల సోమయ్య యాదవ్, వెంకటరామయ్య, హజరత్ నాయుడు, తోట కిష్టయ్య, భార్గవరాం, నరసింహరావు, సుగుణమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం తిరు కల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం 6గంటలకు రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు.



కోనలో శ్రీవారిని దర్శించుకున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల, నెల్లూరు ఆర్డీవో అనూష తదితరులు

బైక్‌ను ఢీకొన్న ఆటో: యువకుడి దుర్మరణం

మరో యువకుడికి తీవ్ర గాయాలు





ఘటనా స్థలం వద్ద విచారిస్తున్న ఎస్ఐ చిన్నబలరామయ్య - సుజిత్ కుమార్(ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తగుంట సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం బైక్‌ను ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఉదయగిరి సుజిత్ కుమార్(22) అనే యువకుడ దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... కోట మండలం జరుగుమల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన ఉదయగిరి సుజిత్ కుమార్, శివ నాయుడుపేట మేనకూరు సెజ్‌లోని గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యారు. ఆదివారం ఉదయం డ్యూటీ దిగిన వీరు పరిశ్రమ వద్దే గదిలో గంట పాటు విశ్రాంతి తీసుకున్న అనంతరం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. చిట్టమూరు మండల పరిధిలోని కొత్తగుంట సబ్‌స్టేషన్ సమీపంలో వెళ్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజిత్ కుమార్ తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శివ కాలు విరిగిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు సంఘటనా స్థలం నుంచి పరారయ్యారు. ఆ మార్గంలో వెళుతున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన శివను 108 వాహనంలో వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ బలరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సుజిత్ కుమార్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సాయంత్రానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, సుజిత్ తల్లిదండ్రులు బాబు, మంజుల షిరిడీ వెళ్లి ఆదివారం మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి కొడుకు మృతి చెందిన విషయం తెలిసి తల్లడిల్లిపోయారు.





గంగమ్మ గ్రామోత్సవం - గంగపెట్టెతో సామూహిక పొంగళ్లు పెట్టేందుకు వెళుతున్న గ్రామస్తులు

గంగమ్మ గ్రామోత్సవం

కోట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాళెం గ్రామదేవత గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి సామూహిక పొంగళ్లు పెట్టారు. గంగపెట్టెతో మేళతాళాల మధ్య అమ్మవారికి పలు అభిషేకాలు చేశారు. వెంకన్నపాళెంలో అమ్మవారి విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా అంకమ్మ కొలుపు



ప్రత్యేక అలంకరణలో అంకమ్మ

వెంకటగిరి టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్టలో వెలసిన అంకమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి కొలుపు నిర్వహించారు. ఉదయం భక్తులు పొంగళ్లు పెట్టారు. కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కరిమాణిక్యస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు సకల దేవతా మూర్తులను ఆహ్వానిస్తూ వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి శేషవాహన సేవ జరిగింది. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరి పాల్గొన్నారు.

రావులపాడులో ఎస్ఐ పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

పెళ్లకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపాడు గ్రామంలో ఆదివారం రాత్రి ఎస్ఐ నాగరాజు పల్లెనిద్ర చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్ఐ నాగరాజును టీడీపీ నాయకులు కొచ్చెర్ల వెంకటరమణ నాయుడు(కేవీ నాయుడు), బాలచంద్ర నాయుడు తదితరులు శాలువాలతో సత్కరించారు.

వైభవంగా నాగార్పమ్మ కొలుపు



ప్రత్యేక అలంకరణలో నాగార్పమ్మ

నాయుడుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం పుదూరు గ్రామంలో నాగార్పమ్మ కొలుపు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో నాగార్పమ్మ, మహాలక్ష్మమ్మ, సూకాలమ్మ, పోతురాజు, పరుశురామయ్య ఉత్సవమూర్తులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. రాత్రి మంగళవాయిద్యాలు, మంత్రోచ్చరణల నడుమ ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. 60 సంవత్సరాల తరువాత నాగార్పమ్మ కొలుపు నిర్వహించడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంపాళెంలో ఆదివారం కవచ చారిటబుల్ ట్రస్టు అధినేత గుండు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిర నిర్వహించారు. వాసవి ఐ కేర్, నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లైన్‌మన్ మృతి

తడ, మే 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ లైన్‌మన్ మృతి చెందాడు. సూళ్లూరుపేట నాగరాజపురానికి చెందిన కాదలూరు కిరణ్‌కుమార్(44) తడ సబ్ స్టేషన్‌లో పనిచేస్తుండేవాడు. ఈ నెల 8వ తేదీ రాత్రి విధులకు హాజరయ్యాడు. 9వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో బోడిలింగాలపాడు శివాలయం సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ కిరణ్‌కుమార్‌ను స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన లక్ష్మీనరసింహస్వామి



గరుడ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పూజలు జరిపారు. సుప్రభాత సేవ, తిరుచ్చి ఉత్సవం, పుష్పాలంకరణ సేవ, విష్ణు, లక్ష్మీనరసింహ సహస్రనామ పారాయణం, హోమపూజలు జరిపారు. తిప్పగుంటపాళెం భక్తబృందం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గరుడవాహనంపై ఊరేగించారు. భక్తులు పాల్గొన్ని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. మేఘనూరు వెంకటకృష్ణయ్య, వెంకటశేషమ్మ, పొన్నలూరు రామచంద్రారెడ్డి, కవిత, యరటపల్లి శరణ్ కుమార్‌రెడ్డి, సాయిపృథ్వీరెడ్డి ఉభయదాతలుగా దంపతులు వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గూడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్ పరిధిలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన నూర్‌బాషా(దూదేకుల) విద్యార్థులకు బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు నూర్‌బాషా సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. 10వ తరగతిలో 500, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులకు పైగా సాధించిన నూర్‌బాషా విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోగా 9347701154 నంబరును సంప్రదించాలన్నారు.

వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవం



వృద్ధులకు దస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, శంకరయ్య తదితరులు

సూళ్లూరుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెముత్తేరిలో ఉన్న సాయి సేవా వృద్ధాశ్రమంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు మస్తాన్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొని ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు దస్తులు పంపిణీ చేశారు. మాతృమూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, నాయకులు మీజూరు వెంకటేశ్వర్లు రెడ్డి, పెంచలయ్య, శ్రీధర్, కొండల్‌రావు, డాక్టర్ పరుచూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోండి

చిల్లకూరు, మే 11 (ఆంధ్ర జ్యోతి): ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా రామచంద్రారెడ్డి, నెల్లూరు రామ్మూర్తి, బెల్లంకొండ రాజేంద్ర, మల్లికార్జున్, సురేష్‌బాబు, మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, మే 11 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. వేద పండితులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకారంలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అంధకారంలో పుత్తేరి గిరిజనకాలనీ

బుచ్చినాయుడుకండ్రిగ, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుతేర్రి గిరిజన కాలనీలో రెండు వీధుల్లో గత పది రోజులు నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్థానికులు అంధకారంలో ఉన్నారు. పది రోజుల క్రితం గాలివాన బీభత్సానికి గిరిజన కాలనీలో రెండు వీధులకు సంబంధించిన విద్యుత్ వైర్లు తెగిపోయాయి. అంతేకాకుండా తాగునీటి మోటరుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తెగిపోవడంతో నీటి కోసం గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేయించాలని ట్రాన్స్‌కో అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని గిరిజనులు కోరుతున్నారు.


గాలులకు తెగిపడిన విద్యుత్ వైరు

వన్నియర్ల ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని మహాబలిపురంలో ఆదివారం దక్షిణ భారత వన్నియకుల క్షత్రియులు, వన్నియార్ల సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సభకు శ్రీకాళహస్తికి చెందిన పలువురు వన్నియకుల క్షత్రియులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వన్నియార్ కుటుంబ సభ్యులను ఒకేతాటిపైకి తీసుకువచ్చి ప్రబల రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడానికి, వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వన్నెకుల క్షత్రియులకు సంక్షేమ పరంగా, రాజకీయ పరంగా సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సీఆర్ రాజన్ ప్రస్తావించారన్నారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, టీడీపీ నాయకులు మునిరత్నం రెడ్డి, చిన్నారెడ్డి, పేట బాలాజీరెడ్డి, ఎంఎస్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.


సమావేశానికి హాజరైన మంత్రి రవీంద్ర, శ్రీకాళహస్తి నేతలు

ఘనంగా మాతృ దినోత్సవం


బీఎన్‌కండ్రిగ ఈసీఐ చర్చిలో, గివింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో మాతృ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తల్లి దగ్గర ఆశీర్వాదాలు తీసుకుని బహుమతులు అందజేశారు. బీఎన్‌కండ్రిగ ఈసీఐ చర్చిలో పాస్టర్ జాన్‌వెస్లీ చర్చిలో మాతృదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వారి నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారమ్మ ఆలయం వద్ద ఉన్న గివింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో మదర్స్‌డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వృద్ధుల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు సాయి దీప, వరలక్ష్మి, ఎంవీ ప్రసాద్; సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

శ్రీకాళహస్తి, మే 11(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం రాజీవ్ నగర్‌లో డ్రోన్ కెమెరా ద్వారా నిఘా, కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 4 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఆకతాయిలు మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా డ్రోన్ ద్వారా పర్యవేక్షించినట్లు తెలిపారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవన్నారు.


పోలీసుల అదుపులో మద్యంప్రియులు

ఎండల్లో తిరగొద్దు: ఆదిమూలం

కేవీబీపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ఎండల్లో తిరిగి వడదెబ్బకు గురికావద్దని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రజలకు సూచించారు. ఆదివారం మిద్దెకండ్రిగలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ... అత్యవసర పనులుంటే తప్ప ఎండల్లో తిరగవద్దన్నారు. ఎవరు కూడా వడదెబ్బకు గురికావద్దన్నారు. ఇక రేషన్‌కార్డులు లేనివారు గ్రామంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే అర్హత ఉండి పింఛన్లు రానివారు కూడా దరఖాస్తులు చేసుకుని తన దృష్టికి తీసుకువస్తే మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయనాయుడు, జయరామిరెడ్డి, ఆరె సర్పంచ్ వెంకటేశ్వర్లు, రాయపేడు సర్పంచ్ బాలాజీ, డాక్టర్ రమేష్, ప్రవీణ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వస్తువుల కొనుగోలుపై అవగాహన ఉండాలి

తిరుపతి(నేరవిభాగం), మే 11 (ఆంధ్రజ్యోతి): వస్తువులు కొనుగోలు చేసే సమయంలో అవగాహన కలిగి ఉండాలని లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా తూనికలు, కొలతల్లో జరుగుతున్న మోసాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. రైతు బజారు, డీమార్టు వద్ద ఎగ్జిబిషన్ నిర్వహించారు. పెట్రోలు, బంగారం కొనుగోలు పట్ల అవగాహన కల్పించారు.

పుత్తూరు వార్తలు

అంజేరమ్మ సేవలో ఎమ్మెల్యే

వడమాలపేట,మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజేరమ్మ కనుమ వద్ద కొలువై ఉన్న అంజేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రత్యేక పూజలు చేశారు. ఎస్వీపురం గ్రామదేవత అంజేరమ్మ ఆలయ వార్షిక కుంభాభిషేకానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఉదయం శాంతి హోమం, మహాక్రతువు, ఆలయ ప్రతిష్ఠాపన, శిఖర అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



జేవీవో సంఘ అధ్యక్షుడిగా లోకనాథం

వడమాలపేట,మే 11(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో జేవీవో(జూనియర్ వెటర్నరీ ఆఫీసర్), వీఎల్వో(విలేజ్ లైవ్ స్టాక్ ఆఫీసర్) సంఘానికి జరిగిన ఎన్నికలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా లోకనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అమరావతిలో సంఘం ఎన్నికలు జరిగాయి. లోకనాథాన్ని అధ్యక్షుడుగా, చిట్టిబాబును కార్యదర్శిగా, వసంతకుమార్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, నరసింహులు, శివకుమార్, అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ప్రతాప్ కుమార్, శ్రీనివాసులు ఎన్నుకొన్నారు.


లోకనాథాన్ని అభినందిస్తున్న సంఘం నాయకులు

నిత్యాన్నదానానికి విరాళం

ఏర్పేడు, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో కొలువై ఉన్న పరశురామేశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన వల్లభనేని ఇవన్, సరళ రూ.5,116 అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారిదర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

రూ.6 కోట్లతో చెరువుల సుందరీకరణ పనులు

రేణిగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 5 చెరువులను రూ. 6 కోట్లతో సుందరీకరణ చేయనున్నారు. ఎల్లమండ్యం చెరువు, తూకివాకం పెద్ద, చిన్న చెరువు, తూకివాకం తుంబురాసుకుంట చెరువు, వెంకటాపురం చెరువుల సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాకులు నిర్మించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. ఈ విషయమై మండల ఇరిగేషన్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా... రూ.1.12 కోట్లతో ఎల్లమండ్యం చెరువు, రూ.1.37 కోట్లతో తూకివాకం పెద్దచెరువు, రూ.1.22 కోట్లతో తూకివాకం చిన్న చెరువు, రూ.41 లక్షలతో తూకివాకం తుంబురాసుకుంట చెరువు, రూ.1.80 కోట్లతో వెంకటాపురం చెరువుల సుందరీకరణ పనులకు ప్రతిపాదనలు ఇది వరకే పంపించగా అనుమతులు రావడంతో త్వరలో అభివృద్ధి పనులు చేపడుతామని ఆయన తెలిపారు.


వెంకటాపురం చెరువు

పెద్ద శేష వాహనంపై కల్యాణ వెంకన్న విహారం

నారాయణవనం, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి స్వామివారు పెద్ద శేష వాహనంపై విహరిస్తూ భక్తులపై వరాల జల్లు కురిపించారు. ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. వేకువజామున 3 గంటలకు ఆలయాన్ని తెరచి, స్వామివారికి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ మాడవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు అనంతరం ఆలయంలో ధ్వజ స్తంభానికి అభిషేకాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు మధ్య గరుడాళ్వార్ చిత్రపటాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపజేయడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక వీరరాఘవ దేవస్థానం నుంచి పద్మశాలీలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. 11 గంటలకు ఉత్సవమూర్తులకు ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం, దీప, ధూప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామివారు ఉభయ నాంచారులతో పరమపదనాథుడిగా ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఉభయ నాంచారులతో విశేష అలంకరణలో కల్యాణ వెంకన్న పెద్ద శేష వాహనంపై అధిరోహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించాన నృత్యా ప్రదర్శనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. డిప్యూటీ ఈవో నాగరత్న, ఈఈ మల్లికార్జున ప్రసాద్, డిప్యూటీ ఈఈ భాస్కర్, ఏఈ గురుప్రసాద్, ఆలయాధికారి నాగరాజు, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభిస్తున్న అర్చకులు - పెద్దశేష వాహనంపై కల్యాణ వెంకన్న

వాయులింగేశ్వరుడి క్షేత్రంలో కొనసాగిన భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, మే 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వారాంతపు, వేసవి సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 423 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,237, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,448 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,658 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,144, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 322, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 215, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 88మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 17,759 విక్రయించినట్లు ఆలయాధికారులు తెలిపారు.



వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



శ్రీకాళహస్తి, మే 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా భక్తకన్నప్ప కొండపై కొలువై ఉన్న చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా కలశ స్థాపన చేసి పూజలు చేశారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా గురు సంక్రమణ పూజలు


పుష్పగిరి మఠంలో, పల్లికొండేశ్వరాలయంలో జరిగిన పూజలు

శ్రీకాళహస్తి మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుష్పగిరి మఠంలో ఆదివారం గురుసంక్రమణ పరిహార హోమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బృహస్పతి వృషభరాశి నుంచి మిథున రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా ఈ పూజలు చేశారు. శివశక్తి సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో తొలుత గణపతి పూజ, కలశ స్థాపన చేశారు. అనంతరం గణపతి, లక్ష్మీగణపతి, గురు సంక్రమణ పరిహార తదితర పూజలను చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గురు బృహస్పతిని దర్శించుకున్నారు. వారికి నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. జయసుధ, సిద్దులయ్య నాయుడు, నీలకంఠం గురుకుల్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లికొండేశ్వరాలయంలో...

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లెలోని పల్లికొండేశ్వరాలయంలో ఆదివారం గురుసంక్రమణ సందర్భంగా గురుసంచార పరిహార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడి విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని దక్షిణామూర్తికి అభిషేకాలు చేశారు. అనంతరం గురు భగవానుడికి పంచామృతాలతో అభిషేకించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. గురు సంచార పరిహార పూజల కోసం మేషం, మిథునం, కర్కాటకం, కన్య, వృశ్చికం, మకర రాశుల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్



శ్రీకాళహస్తి, మే 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఎమ్మెల్సీ కావాలి గ్రీష్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మే 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధా గురుదక్షిణామూర్తికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు వృషభరాశి నంచి మిథున రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు దర్శించుకున్నారు.

కష్టాలు తెలిసిన వారే పేదల సమస్యలు తీర్చుతారు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 11(ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలు తెలిసిన వారే వారి సమస్యలు తీర్చగలుగుతారని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి సివిల్స్‌లో 988 ర్యాంకు సాధించిన పామూరు సురేష్‌యాదవ్‌ను ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. నరసింహయాదవ్ మాట్లాడుతూ సురేష్‌యాదవ్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, జయరాంయాదవ్, వాసుయాదవ్, హేమంత్ యాదవ్, మునస్వామి యాదవ్, వెంకటముని యాదవ్, భరణి యాదవ్, శ్రీనివాసులుయాదవ్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.


సురేష్‌యాదవ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నేడు చిత్రా పౌర్ణమి

పిచ్చాటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరిలో వెంకయ్యస్వామి దేవాలయంలో, సిద్ధిరాజు కండ్రిగ సోమనాథేశ్వర ఆలయంలో సోమవారం చిత్రా పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కోలాటాలు, భజన, చెక్క భజన, భక్తమార్కండేయ పౌరాణిక నాటకం ఉంటాయని ఆలయాల నిర్వాహకులు పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



రేణిగుంట, మే 11, (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లలో అర్బన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో ఏకకాలంలో ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. అనుమానం ఉన్న వ్యక్తుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

వేదనారాయణుడి సేవలో జిల్లా జడ్జి

సత్యవేడు, మే 11 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం పట్టణంలోని వేద నారాయణస్వామి ఆలయాన్ని జిల్లా ఏసీ సీ ఎస్టీ ఫోర్ట్ ఏడీజే జడ్జి జి.అర్చన ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు పలికి, ప్రసాదాన్ని, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి చెంగల్రాయులు, ఎస్ఐ సునీల్, ప్రధానఅర్చకుడు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.


దర్శనానంతరం జడ్జి అర్చన

టీడీపీ ఉత్తమ కార్యకర్త రుద్రయ్యకు సన్మానం

నాగలాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ఉత్తమ కార్యకర్తగా ప్రశంసాపత్రం అందుకున్న టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రుద్రయ్యను సురుటుపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాన్సన్, నాగరాజ్, చాన్‌బాషా, మాతయ్య, మనోజ్, సురేష్ యాదవ్, మండేలా తదితరులు పాల్గొన్నారు.

ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ మృతి పట్ల రాస్ సంతాపం

రేణిగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.అయ్యప్పన్ మృతి పట్ల ఆదివారం మండల పరిధిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్ర సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాస్ కేవీకే ఛైర్మన్ డాక్టర్ వెంకటరత్నం, కేవీకే హెడ్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ... భారత వ్యవసాయ రంగంలో డాక్టర్ అయ్యప్పన్ చేసిన కృషి, అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా, పాలనాదక్షునిగా దేశ వ్యవసాయ అభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారని కితాబిచ్చారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రేణిగుంట, మే 11, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సీఐ జయచంద్ర కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం రౌడీ షీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఘర్షణలకు దిగినీ పంచాయితీలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.